సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కోటగిరి



పోతంగల్ మండలంలోని కొడిచెర్ల గ్రామంలో కొడిచర్ల గ్రామం నుంచి కల్లూరు వరకు రూ.90లక్షల ఎంఆర్ఆర్ నిధులతో బీటీ నిర్మాణం కొరకు, రూ.5లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను స్థానిక సర్పంచి పుష్ప భీమ్‌రావు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, ఏజాస్ ఖాన్, వెంకటి, కొల్లూరు కిషోర్ బాబు, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లిలో కుస్తీ పోటీలు

నవతెలంగాణ-లింగంపేట్



మండలంలోని లింగంపల్లి గ్రామంలో కుస్తీ పోటీలు శుక్రవారం నిర్వహించినట్టు సర్పంచ్ బండి రాజయ్య తెలిపారు. అదేవిధంగా తెల్లవారుజామున రథోత్సవ కార్యక్రమం నిర్వహించామన్నారు. ముఖ్యంగా పురుషులతో పోటీపడేందుకు హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన యువతీలు కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు వెండి కడియాలు నగదును సర్పంచ్ రాజయ్య, ఉప సర్పంచ్ రవి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అందజేశారు.

ధాన్యం దళారుల పాలు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో అవస్థలు

- చిరుజల్లులతో మరింత ఆందోళన

నవతెలంగాణ-నసురుల్లాబాద్/ఎడపల్లి

ఆరుగాలం కష్టించి పంట పండించిన రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారు. ఇప్పటికే పలుచోట్ల వరి కోతలు ప్రారంభమయ్యాయి. అయినా.. ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇంతవరకూ ప్రారంభించకపోవడంతో ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. దీనికి తోడు శుక్రవారం నుంచి ఆకాశం మేఘావృత్తమై ఉండటంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్, నసురుల్లాబాద్, బాన్సువాడ మండలాల సాగుభుములు నిజాంసాగర్ ప్రధాన కాలువ కింద ఉండడంతో అధిక శాతం వరి పంటను సాగు చేస్తారు ఇక్కడి రైతులు. బాన్సువాడ డివిజన్ పరిధిలో గత 15 రోజులుగా ధాన్యం కోతలు పనులు సాగుతున్నాయి. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం కొందరు రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారు. దీనికితోడూ శుక్రవారం బాన్సువాడ డివిజన్ పరిధిలో చిరుజల్లులతో కూడిన వర్షం కురియడంతో ధాన్యం రాశులపై రైతులు టార్పాలిన్లు కప్పడంలో నిమగ్నమయ్యారు. కొద్దిపాటి చినుకులు రావడంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు.



ధాన్యం తూకం వేసి లారీలో లోడ్ చేస్తున్న ప్రయివేటు వ్యక్తులు

ఒకవైపు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడం, మరో వైపు వరి కోతల సమయంలో అకాల వర్షాలు సంభవించి రైతులకు అపారమైన నష్టం వాటిల్లుతుందనే ఆలోచనతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్‌లో మూడు సహకార సంఘాలు, నస్రురుల్లాబాద్ మండలంలో నాలుగు సహకార సంఘాలున్నాయి. బాన్సువాడ మండలంలో ఐదు సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తుంది. ఈ యాసంగిలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయక పోవడంతో రైతులు తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్టపోతు న్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. నేటి వరకు ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేయక పోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



ఎడపల్లిలో ధాన్యం కుప్పలు

వరి కోతకు వర్షం దెబ్బ..

ఎడపల్లి : మండలంలో వరికోతలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మండలంలోని సుమారు 25శాతం మంది రైతులు వరి కోతను పూర్తి చేశారు. కోతలు ఇంకా పూర్తికాకపోవడంతో ఇదే సమయంలో చిరుజల్లులు కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

వరి పంట కోతకోసే సమయంలో వర్షం పడటం పట్ల ఆందోళన చెందుతున్నారు. పంట కోసిన రైతులు చిరుజల్లులు కురవడంతో ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని దళారులకు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. రూ.1500 నుంచి రూ.1830 వరకు క్వింటాకు చెల్లించి దళారులు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. వరికోతలు ప్రారంభమైనందున దళారుల బెడద నుంచి రైతులను ప్రభుత్వం కాపాడేందుకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నిరుపేదలకే ఇండ్లు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గంలో ఇప్పటివరకు 15వేల డబుల్ బెడ్ రూములు పంపిణీ చేశామని, ఎక్కడా అవకతవకలు జరగలేదని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కోటయ్య క్యాంపులో డబుల్ బెడ్ రూమ్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం సాయిబాబా వంటశాల ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు అసలైన నిరుపేదలకే డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని తెలిపారు. వర్ని మండలం ఎస్ఎన్ పురం గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణం కొరకు రూ.10 కోట్ల 70 లక్షలు సీఎం కేసీఆర్ మంజూరు చేసినట్టు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అకాల వర్షాలు పడుతున్నందువలన రైతులు ధాన్యం నష్టపోకుండా ముందస్తుగా మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం కల్లా ప్రారంభించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆదేశించారు. అనంతరం రంజాన్ పండగ కానుకలను పేద మైనార్టీలకు అందజేశారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న స్పీకర్

జలాల్పూర్, ఎస్ఎన్‌పురం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, జెడ్పీటీసీ హరిదాస్, ఎంపీపీ మేక శ్రీలక్ష్మి, బాలరాజ్, మండల అధ్యక్షులు గిరి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపాల్, డైరెక్టర్లు గఫర్, కోఆప్షన్ నెంబర్ కరీం, సీనియర్ నాయకులు మేక వీర్రాజు, మేక బుజ్జన్న, శ్రీహరి, మైనార్టీ నాయకులు హైమద్, సత్తార్, సోషల్ మీడియా ప్రచార కార్యదర్శి సరిచందు, వెంకట్‌గౌడ్, కురువ గణేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని మొదటి కొనుగోలు కేంద్రం..

వర్ని మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రం బాన్సువాడ నియోజకవర్గంలో వర్ని ఉమ్మడి మండల రైతుల కోసం ప్రారంభించినట్టు తెలిపారు.

పిట్లంలో సినీనటి శ్రీముఖి సందడి

- సెల్ బే షాప్ ప్రారంభం

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని బాన్సువాడ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మల్టీ బ్రాండ్ మొబైల్ రిటైల్ చైన్ సెల్ బే షాపును ఫెమ్ నటి శ్రీముఖి శుక్రవారం ప్రారంభించి సందడి చేశారు.



తరలివచ్చిన అభిమానులను సెల్ఫీ తీసుకుంటున్న నటి శ్రీముఖి



నూతన షాప్ ప్రారంభం

అనంతరం ఆమె మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ వినియోగం నిత్యజీవితంలో ఒక భాగమన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మొబైల్ ఫోన్ వవ్యస్థ మానవ సంబంధాలకు చేరువలో ఉంచుతుందన్నారు. మొబైల్ ఫోన్ లగ్జరీ వస్తువు కాదని, ఎసెన్సియల్ కామాడిటిగా మారిందని అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని అన్ని పట్టణ, మండలాలలో సెల్ బే సేవలు విస్తరించనున్నట్లు ఆమె తెలిపారు. సెల్ బే సంస్థ ఎండీ సోమ నాగరాజు మాట్లాడుతూ.. జిల్లా వినియోగదారులకు ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతుల ఆఫర్లతో పాటు 0 శాతం ఫైనాన్స్ ఆప్షన్లు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సుహాస్ నల్లచెరువు, షో రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- చెట్టును ఢీకొని యువకుడు మృతి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

అతి వేగంగా బైక్ నడపడంతో చెట్టుని ఢీకొట్టి యువకుడు మృతిచెందిన ఘటన ఎల్లారెడ్డి మండలంలోని మీసన్‌పల్లి గ్రామ శివారు వద్ద అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం నిజాంసాగర్ మండలం వడ్డేపల్లి నల్లగుట్ట తండాకి చెందిన ధారవత్ సరిచంద్(28) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి తండాలోని వాళ్ళ అక్క శాంతిభాయి వద్దకు వెళ్లాడు. అక్కడినుంచి వారు బొల్లరంలో ఉండే బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాత్రి సమయంలో వస్తుండగా బైక్‌ని అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో మీసన్‌పల్లి గ్రామ శివారులోని మూల మలుపు వద్ద గల చెట్టును ఢీకొన్నాడు. రోడ్డు పక్కన బండరాళ్లపైన పడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల ఉన్న వారి అక్క తలకు, చేతికి గాయాలయ్యాయి. మృతుడి భార్య పారుభాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



బోరున విలపిస్తున్న బాధితులు

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైన ఘటన భిక్కనూర్ పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన మల్లేశం ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకుంది. గమనించిన స్థానికులు నిప్పు ఆర్పే ప్రయత్నం చేసినా మంటలు అదుపులోకి రాలేదు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో 4 తులాల బంగారం, 50 తులాల వెండి, రూ.42 వేల నగదు, వంట సామగ్రి, బట్టలు సుమారు లక్ష యాభై వేల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. ప్రభుత్వ ఆదుకోవాలని కుటుంబీకులు కోరారు.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బస్వాపూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బాలరాజు (73) కుమారుడు రెండు సంవత్సరాల క్రితం మరణించాడు. అప్పటినుంచి కుమారుడి మరణాన్ని తట్టుకోలేక బాధపడుతూ ఉండేవాడు. జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం కుటుంబీకులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విభజన హామీలను అమలు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్

నవతెలంగాణ-కోటగిరి

విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ బాన్సువాడ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని సీపీఐ మండల కార్యదర్శి విటల్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా బీజేపీ హటావో దేశ్‌కో బచావో కార్యక్రమం విజయవంతంకై ఈనెల 14 నుంచి మే 15 వరకు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో ప్రతి ఒక్క కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 8న హైదరాబాద్ విచ్చేయనున్న ప్రధాని మోడీ పర్యటన నిరసిస్తూ రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహాల వద్ద నల్ల బ్యాడ్జీలు, నల్లజెండాలతో సీపీఐ నిరసన చేపట్టనున్నట్టు వివరించారు. తెలంగాణకు మోడీ తీరని అన్యాయం చేశారని, గడిచిన 9 ఏళ్లలో తెలంగాణకు మోడీ చేసిందేమీ లేదని అన్నారు. సింగరేణి ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తెలంగాణకు విభజన హామీలు అమలు చేయాలని అన్నారు. ప్రధాని మోడీకి తెలంగాణ రాష్ట్రంలో అడుగుపెట్టే నైతిక హక్కు లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం పండించిన వడ్లను వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజానీకానికి ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వై.ఓమయ్య, కోటగిరి మండల నాయకులు నల్లగంగాధర్, రుద్రూర్ మండల కార్యదర్శి ఫారుక్, బాన్సువాడ నియోజకవర్గ నాయకులు నాగిరెడ్డి, మతిన్, రాజు, గఫూర్, బుడాల రాములు, శరత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.సుధాకర్

మినీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

జిల్లాలోని నాచుపల్లి, మాచారెడ్డిలోని మినీ గురుకులాల్లో గల వివిధ తరగతుల్లోని ఖాళీల భర్తీకి (2023-24) అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్, రీజినల్ కో ఆర్డినేటర్ టి.సంపత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాచుపల్లిలోని మినీ గురుకులంలో ఒకటవ తరగతిలో 30 సీట్లతోపాటు రెండవ తరగతిలో 9 బ్యాక్‌లాగ్ సీట్లు, మాచారెడ్డి ఒకటవ తరగతిలో 30, రెండవ తరగతిలో 5 బ్యాక్‌లాగ్ ఖాళీల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు. ఆయా పాఠశాలల్లో చేరేందుకు నస్రుల్లాబాద్, మాచారెడ్డి మండలాలకు చెందిన పీవీటీజీ గిరిజన బాలికలకు మాత్రమే అవకాశం ఉందని పేర్కొన్నారు. 5 సంవత్సరాల వయసు పూర్తి చేసుకున్న బాలికలు మే4వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని, వచ్చే నెల 9వ తేదీన జిల్లా అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ సమక్షంలో లాటరీ పద్ధతిన విద్యార్థినులను ఎంపిక చేస్తామని తెలిపారు. తల్లిదండ్రులు ఆదాయపు ధృవీకరణ పత్రంతోపాటు పుట్టిన తేదీ సర్టిఫికెట్, కులం, ఆదాయం, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జత చేసి గజిటెడ్ అధికారి ధృవీకరణతో నాచుపల్లి, మాచారెడ్డి మినీ గురుకులాల్లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. వివరాలకు 6300472214 (నాచుపల్లి), 6300132131 (మాచారెడ్డి) నెంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

కోటగిరిలో వడ్ల లారీ నిలిపివేత

నవతెలంగాణ-కోటగిరి

వడ్ల లారీని నిలిపివేసిన ఘటన కోటగిరిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కోటగిరి మండల కేంద్రంలోని మిర్జాపూర్ కాలనీకి చెందిన రైతు రమేష్ నాలుగు రోజుల క్రితం క్వింటాకు రూ.1700 చొప్పున నాలుగు వందల బస్తాల వరి ధాన్యాన్ని మండలానికి చెందిన దళారికి కొనుగోలు చేశాడు. అయితే శుక్రవారం ధాన్యం బాగోలేదని తిరిగి విచ్చేయడానికి కోటగిరికి ధాన్యాన్ని తీసుకు వచ్చాడు ఆ దళారి. ఈ విషయాన్ని మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబుకు రైతు తెలపగా.. లారీ నిలిపివేసిన స్థలానికి చేరుకుని దళారి చేసిన మోసంపై నిలదీశారు. మిర్యాలగూడ నుంచి వరి ధాన్యం కొనుగోలు చేయడానికి రావడం, కొనుగోలు చేసేటప్పుడు ఒక మాట.. కొనుగోలు అయిన తర్వాత మరో మాట మాట్లాడి.. ఇష్టారా జ్యంగా వ్యవహరి స్తున్నారని, రైతులందరూ దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన పేర్కొన్నారు.



నిలిపిన లారీ

మొక్కజొన్న సొప్ప తిని ఆవు, దూడ మృత్యువాత

- 15 ఆవుల పరిస్థితి విషమం

నవతెలంగాణ-లింగంపేట్

మొక్కజొన్న సొప్ప ఆవు, దూడ మృత్యువాతపడ్డాయి. మరో 15 ఆవుల పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని నల్లమడుగు పెద్ద తండాలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తండాలోని రావుజకు చెందిన 100 పైగా ఆవులు రోజువారీగా మేతకు వెళ్లాయి. శుక్రవారం మధ్యాహ్నం మొక్కజొన్న సొప్ప తిని అనంతరం చెరువులో నీరు తాగడంతో రెండు ఆవులు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. ఇది గమనించిన రావుజ మరో 15 ఆవులు పరిస్థితి విషమించడంతో పశువైద్యాధికారులకు, గోపాలమిత్ర సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని 15 ఆవులకు చికిత్స చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల మొక్కజొన్నకు మందు స్ప్రే చేయడం వల్ల ఆ సొప్ప తినడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుందని తండావాసులు తెలిపారు.



మృత్యువాతపడిన ఆవు

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న విష్ణువర్ధన్

నవతెలంగాణ-భిక్కనూర్

మండ లంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన కొండ సాయిలు తల్లి కొండ దుర్గవ్వ శుక్రవారం మరణించడంతో విషయం తెలుసుకున్న కామారెడ్డి బీజేపీ అసెంబ్లీ ఇన్చార్జ్ వెంకటరమణారెడ్డి నిరుపేద కుటుంబానికి దహన సంస్కారాలకు రూ.5000 ఆర్థిక సహాయం పంపించడంతో గ్రామ అధ్యక్షుడు విష్ణువర్ధన్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బస్వారెడ్డి, సాయిలు, మల్లేష్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని బస్‌స్టాండ్, అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ శ్రీరాధా హాస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసిన శ్రీ రాదా ఆసుపత్రి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎండాకాలం పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలెందర్ రెడ్డి, ఎరుకల సాయిలు, సర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మినీ గురుకులానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మాక్లూర్

మాక్లూర్ మండల కేంద్రంలోని మినీ గురుకులంలోగల ఖాళీల భర్తీకి (2023-24) అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు రీజినల్ కో ఆర్డినేటర్ టి.సంపత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకనలో తెలిపారు. ఒకటవ తరగతిలో 30 సీట్లు, రెండో తరగతిలో ఏడ సీట్లు, మూడవ తరగతిలో 8 సీట్లు, నాల్గవ తరగతిలో 3 బ్యాక్ లాగ్ సీట్ల భర్తీ కోసం (పివిటిజి)గిరిజన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మాక్లూర్ మండలానికి చెందిన గిరిజన బాలికలకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. ఐదుసంవత్సరాల వయసు పూర్తి చేసుకున్న బాలికలు వచ్చే నెల 4 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వచ్చే నెల 8న జిల్లా అదనపు కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆదాయ ధృవీకరణ పత్రంతోపాటు బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో మాక్లూర్ మినీ గురుకులంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. వివరాలకు 8500092979, 6300755249 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

జీపీ భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని దేవన్‌పల్లి, కారేపల్లి, తాళ్లపల్లి గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులకు జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, యంపిపి ఆర్మూర్ మహేష్, పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాండలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా వాటిని గ్రామపంచాయతీలుగా మార్చిందని, ఇందులో భాగంగానే వాటికి సొంత భవనాలకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నిధులు మంజూరు చేశారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మోయిజ్, రైతుబంధు మండల అధ్యక్షుడు శర్మనాయక్, సర్పంచ్‌లు బొడ్డు దేవాయిగంగారాం, చంద్రకళ వాసునాయక్, యంపిటీసిలు, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన
- "అందరికీ ఆరోగ్యం" థీమ్‌తో 75వ వార్షికోత్సవం
- పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో ర్యాలీ



ఆర్మూర్‌లో ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

మెడికవర్ హాస్పిటల్‌లో నందు ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని బ్యాక్ టు ది రూట్స్అనే థీమ్‌తో ప్రజలకి, సిబ్బందికి అవగాహ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.డాక్టర్ దత్తురాజ్ జనరల్ ఫిజిషియన్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్వో) ప్రపంచ ఆరోగ్య దినోత్సవం 75వ వార్షికోత్సవాన్ని "అందరికీ ఆరోగ్యం" అనే థీమ్‌తో జరుపుకుంటోందన్నారు. ఆరోగ్యంకోసం పూర్వీకుల ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లను గుర్తించి అనుసరించేలా ప్రజలను ప్రోత్సహించడానికి బ్యాక్ టు ది రూట్స్ అనే థీమ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ భారతీయ సాంప్రదాయ జీవనం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తద్వారా నేటి తరంలోని ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితాలను గడుపుతారని తెలిపారు. మజ్జిగ అన్నం తినడం, మట్టి పాత్రల్లో ఆహారాన్ని వండడం, ఇంట్లోకి ప్రవేశించే ముందు పాదరక్షలు బయట ఉంచడం, చేతులతో తినడం, భోజనం, నీరు కూర్చొని తాగడం, ఇంట్లో తయారుచేసిన ఆహారం తినడం, త్వరగా రాత్రి భోజనం చేయడం, పొద్దున్నే లేవడం వంటివి భారతీయ సాంప్రదాయ పద్ధతులను అనుసరించా లన్నారు.ఆరోగ్య కరమైన ఆహారం తీసుకోవాలని, శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవాలని, రోజులో సరైన నిద్ర పోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, మద్యం, సిగరెట్లు మానేయాలని అన్నారు. కార్యక్రమంలో పేషెంట్లు, బంధువులు, ప్రజలతో పాటుగా డాక్టర్ సందీప్ రావ్, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ శ్రీనివాస్ , డాక్టర్ స్పందన , డాక్టర్ రచన, ఆస్పత్రి మేనేజ్మెంట్ స్వామి శ్రీనివాస్ శర్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఖలీల్‌వాడీలోగల ఇందూర్ న్యూరో సైకియాట్రి ఆస్పత్రిలో శుక్రవారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఆరోగ్యం మహాభాగ్యం అనే సూచనలతో కూడిన కరపత్రాలు ఆవిష్కరణ చేసినట్టు క్లబ్ అధ్యక్షులు సతీష్ షాహ తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ ఆకుల మాట్లాడుతూ కోవిడ్ తదానంతరం జీవన విధానంలో అనేక రకాల మార్పులు వచ్చాయని అన్నారు. రోగ నిరోధక శక్తిని పెంపొందించే విధంగా పోషకాలతో కూడిన ఆహారాన్ని సమతుల్యంగా తీసుకోవాలని సూచించారు. చెడు అలవాట్ల కు దూరంగా ఉండి కూరగాయలు పండ్లు తదితర ప్రొటీన్లతో కూడిన ఆహారాన్ని తీసుకుంటూ కనీస వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని తెలియజేశారు. మద్యం, గుట్కా, పాన్, సిగరెట్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం అందరికీ పండ్లు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



కంఠేశ్వర్: మెడికవర్ ఆస్పత్రిలో..

ఆర్మూర్ :జంక్ ఫుడ్ తినడం తగ్గించి క్రమం తప్పకుండ వైద్య పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ రమేష్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పెర్కిట్, గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వరంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలతో సహా పోషక ఆహారాన్ని తినాలని సూచించారు. జంక్ ఫుడ్ తినడం తగ్గించాలని, ఆల్కహాల్ మానుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చెయ్యాలని సురక్షిత మైన నీటిని తాగాలని తెలిపారు. కార్యక్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మానస సబ్ యూనిట్ ఆఫీసర్ సాయి, సూపర్ వైసర్ రవీందర్, ఆరోగ్య కార్యకర్తలు ఎస్తేరు రాణి, గణేష్, ఆశ కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





కంఠేశ్వర్: మెడికవర్ ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వరద కాలువలో మృత దేహం లభ్యం

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని పాలెం రహదారిలో వరద కాలవ వద్ద ఓ మృత దేహం లభ్యమైనట్లు ఎస్సై ముత్యంరాజు తెలిపారు. ఆర్మూర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ మూడు రోజుల నుండి కనిపించకుండా పోయాడని కుటుంబ సభ్యులు ఆర్మూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇంటి నుండి వెళ్లిన శ్రీనివాస్ మృతదేహం వరద కాలువలో లభించినట్లు తెలిపారు. మృతి దేహం వద్ద దొరికిన సిమ్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


మృతదేహాన్ని తీసుకున్న దృశ్యం

నవ్య నాటక సమితి వార్షికోత్సవంలో భారతి నృత్యానికేతన్ నాట్య గురువు


వార్షికోత్సవంలో పాల్గొన్న సరోజ ప్రియదర్శిని

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద గల భారతి నృత్యానికేతన్ నాట్య గురువు సరోజ ప్రియదర్శిని శుక్రవారం హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. భారతీయ శాస్త్రీయ నృత్య సంగీత రీతుల పరిశోధనాత్మక ప్రసంగాలపై జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ అరుణ భిక్షం, డిఎస్సీ శాస్త్రి, నిర్వాహక సంఘం అధ్యక్షులు యూవీఎల్ ఆనంద, నవ్య నాటక సమితి అధ్యక్షులు విజయకుమార్, కార్యదర్శి ఆర్ఎస్ సుధారాణి, తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు..

ఎలాంటి ఆపద ఉన్న వెన్నంటే ఉంటా

- ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


డిచ్‌పల్లి : చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎలాంటి ఆపద ఉన్నా నియోజకవర్గ ప్రజలకు వెన్నంటే ఉంటానని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండలాలకు చెందిన లబ్దిదారులకు ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా యువ నాయకులు, జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు, ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్మోహన్ తో కలిసి లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఎండి కుర్షీద్ అహ్మద్ కు లక్షా 50 లక్షల రూపాయలు, ఇందల్‌వాయి మండలంలోని మేఘ్యా నాయక్ తండాకు చెందిన ఎల్. కిషన్‌కు రూ.60 వేల రూపాయల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, డిచ్‌పల్లి జడ్పిటిసి దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య, ఎంపీపీ బాధావత్ రమేష్ నాయక్, మండల అధ్యక్షులు చింత శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు చిలివేరి గంగా దాస్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు సాయిలు , సర్పంచుల ఫోరం అధ్యక్షులు మోహన్ రెడ్డి, అశోక్, యూత్ అధ్యక్షులు అమీర్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.


సిరికొండ: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

సిరికొండ:ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు గొప్ప వరమని, దేశంలో ఎక్కడా లేనివిధంగా అనేక సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టారని, టీఎస్ ఆర్టీసీ చైర్మన్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శుక్రవారంజిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు. మైలారం గ్రామానికి చెందిన నిత్యశ్రీకి 36వేలు, చల్ల లింబయ్య 18వేలు, మొలిగే చిన్న గంగారంకు రూ.16వేల చెక్కులను అందజేశారు. కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప వరమని తెలిపారు.కార్యక్రమంలో మైలారం సర్పంచ్ గాండ్ల రమ్య సత్యానంద్, ఎంపీటీసీ గాండ్ల సతీష్ పటేల్, లింబాద్రి మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

16 ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-భీంగల్

చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మధుశేఖర్ ఆధ్వర్యంలో ఈనెల 16న భీంగల్ పట్టణకేంద్రంలోని శ్రీసరస్వతి విద్యామందిర్ పాఠశాలలో ఉచిత వైదశిబిరం నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ పర్స నవీన్ తెలిపారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి యుఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ఆరంభించనున్నారని అన్నారు. ఇందులో అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా చేస్తారని, కనుక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నవీన్ తెలిపారు.

కేసీఆర్ కుటుంబం జోలికి వస్తే కుప్పకూలిపోతారు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

కేసీఆర్ కుటుంబం జోలికి వస్తే కుప్పకూలిపోతారని, దేశాన్ని పందికొక్కుల్లా దోచుకుతింటున్న బీజేపీ దొంగలపై బీఆర్ఎస్ దంగల్ మొదలైందని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి హెచ్చరించారు. బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో బెయిల్ వచ్చిందని సంబరపడుతూ ఏదేదో వాగుతున్న బండి సంజయే లీకేజీకి కర్మ కర్త క్రియ అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ , మంత్రి కేటీఆర్ , ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఏ తప్పు చేయకుంటే గుడ్ జాబ్ అని ప్రశాంత్‌ను ఎందుకు అభినందించావు?. ప్రశాంత్‌కు బీజేపీ ముఖ్య నేతలతో సాన్నిహిత్యం ఉన్నది నిజం కాదా..? కేసీఆర్ పాలనలో ప్రతీ గ్రామంలో అభివృద్ధి, ప్రతి ఇంట్లో సంక్షేమం వెల్లి విరుస్తోందని అన్నారు. ఒక్క రైతుల కోసమే నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశాం. కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొనే దమ్ములేకనే అధికారం కోసం ఎలాంటి గడ్డికరవడానికైనా వెనకాడకుండా అడ్డదారులు తొక్కుతున్నారని తెలిపారు. ఇందులో భాగమే గతంలో జీహెచ్ ఎం సీ ఎన్నికలలో యువతను ఆత్మహత్యలకు పురికొల్పేల రెచ్చగొట్టే ప్రసంగాలు. ఇప్పుడు విద్యార్థుల భవిష్యత్ నాశనం చేసేలా ప్రశ్నా పత్రాల లీకేజీలని అన్నారు. 2018లోనే కేబినెట్ ఆమోదం పొంది నిర్మాణ దశలో ఉన్న ఎయిమ్స్ కు మళ్లీ భూమి పూజ ఏమిటని ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకానికి మోడీ లాగా భూమి పూజలు చేయాలంటే కేసీఆర్‌కు 30 ఏండ్లు కూడా చాలవని అన్నారు. విదేశాల నుంచి నల్లధనం తెస్తామని చెప్పి స్వదేశంలో నల్లబంగారం అమ్ముతుండ్రు. సింగరేణి ని అమ్మి తెలంగాణ గొంతు నులమాలని కుట్రలు చేస్తున్నారని, ప్రజాపోరాటం ద్వారా సింగరేణిని దొంగల పాలు కానివ్వకుండా కాపాడు కుంటామని తెలిపారు. వచ్చే ఎన్నికలతో బీజేపీకి నూకలు చెల్లడం ఖాయమని ఆయన అన్నారు. తెలంగాణలో బీజేపీకి అధికారం ఒక పగటి కల అని, గత ఎన్నికల్లో 107 స్థానాలలో డిపాజిట్లు కోల్పోయిన బీజేపీకి అధికారం ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ గారి నాయకత్వమే దేశానికి శ్రీరామ రక్ష అని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

చక్రపాణికి విద్యారంగ విశిష్ట సేవా పురస్కారం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి చెందిన శ్రీ సరస్వతి మోడల్ స్కూల్ కరస్పాండెంట్ చక్రపాణి విద్యారంగ విశిష్ట సేవ పురస్కారం అందుకున్నట్టు శుక్రవారం తెలిపారు. ట్రస్మా ఆర్మూర్ డివిజన్ ఆధ్వర్యంలో వేల్పూర్ మండల కేంద్రంలో జరిగిన "విద్యారంగా, విశిష్ట సేవా పురస్కార్ " కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని "శ్రీ సరస్వతి మోడల్ స్కూల్ -జక్రాన్ పల్లి. కరెస్పాండెంట్ శ్రీ చక్రపాణి అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షఫీ, డివిజన్ అధ్యక్షులు రాజు గుజరాతి , జక్రాన్ పల్లి మండల స్కూల్స్ కరెస్పాండెంట్స్, ఇతర స్కూల్స్ కరెస్పాండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.


పురస్కారం అందుకుంటున్న చక్రపాణి

చైతన్య యూత్ ఆధ్వర్యంలో సన్మానం


రామమందిర వార్షికోత్సవంలో సేవలు చేసినవారిని సన్మానించిన చైతన్య యూత్‌సభ్యులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని ఇందల్‌వాయి గ్రామంలో శ్రీరామనవమి నుండి ప్రారంభమైన రామ మందిర వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నాగవల్లితో ఘనంగా ముగిసినట్లు గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ మారంపల్లి సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. యూత్ సభ్యులు మాట్లాడుతూ ఇందల్ వాయి గ్రామంలోని అతి పురాతనమైన ఆలయంలో ఆలయసేవలో అహర్నిశలు పాలుపంచుకున్న సభ్యులందరినీ యువ చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గుడి ప్రాంగణంలో భక్తుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఇతర యువకులు కూడా ఆదర్శంగా నిలవాలని ఇందల్‌వాయి గ్రామ యువతకు యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు వారు ఆనందం వ్యక్తం చేశారు.

ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు

- పాల్గొన్న డీఎస్పీ


కవారు చేస్తున్న ర్యాపిడ్‌యాక్షన్‌ఫోర్స్ బెటాలియన్ అధికారులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

అత్యవసర సమయంలో, విపత్కర పరిస్థితుల్లో రాపిడ్ యాక్షన్‌ఫోర్స్ సేవలు అందిస్తుందని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పట్టణంలో రాపిడ్ యాక్షన్‌ఫోర్స్ బెటాలియన్ అధికారులు, పోలీసులు కమ్యూనిటీ పోలీసింగ్, మాబ్ కంట్రోల్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డిఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ రాపిడ్‌యాక్షన్‌ఫోర్స్ అనేది విపత్కర పరిస్థితులు, అత్యవసర సమయంలో స్థానిక పోలీసులకు అండగా ఉండి సేవలు అందిస్తుందని తెలిపారు. రాపిడ్‌యాక్షన్‌ఫోర్స్ ప్రజల్లో ధైర్యం నింపి ఆత్మవిశ్వాసం పెంపొందేలా కృషి చేస్తుందని అన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేలా ఈ రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అవగాహన సదస్సులు జరిపి కవాతు నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల్లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది కవాతు నిర్వ హించారు. కార్యక్రమంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ అధికారి ప్రవీణ్ కుమార్ రావత్, సీఐ శ్రీనివాస్, లింగంపేట్, నాగిరెడ్డిపేట్,గాంధారి ఎస్సైలు ఆంజనేయులు, శంకర్, సుధాకర్ పాల్గొన్నారు.



పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

- అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధ, గురువారాల్లో తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల్లో మొక్కజొన్న, వరి. పత్తి, మార్కెట్లో ఉన్న మిర్చి తదితర పంటలు విపరీతంగా నష్టపోయాయని, ఖమ్మం జిల్లా కుడిచెర్ల మండలం కొత్త కాచారం గ్రామంలో విపరీతంగా పంట నష్టపోయిందని అన్నారు. గత నెల 16 నుండి 20 వరకు కురిసిన భారీ వర్షాలు, వడగళ్ల వాన, ఈదురు గాలుల్లో ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడినల్గొండ, మహబూబ్నగర్ జిల్లాలో సుమారుగా రెండు లక్షల ఇరవై ఎనిమిది వేల ఎకరాలు వాణిజ్య పంటలు, వరి ధాన్యం, మల్లె తోటలు నష్టపోయినట్లుగా ప్రాథమిక సమాచార నివేదికలు తెలిపాయన్నారు. ఈ నష్టం మూడు లక్షల పైనే ఉంటుందని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారని తెలిపారు. హుటా హుటిన ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలు పర్యటించి ఎకరానా పదివేల రూపాయలు తాత్కాలిక సాయం కింద రైతులకు ఇవ్వాలని ప్రకటించి పది రోజులు గడిచిన వ్యవసాయ శాఖ అధికారుల సర్వేలే పూర్తికాలేదని అన్నారు. తాజాగా కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు,,వాణిజ్య పంటలకు ఎకరానా లక్ష రూపాయలు, ఇతర పంటలకు ఎకరానికి 50వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, నల్గొండ జిల్లా లో వరి పంట కోతలు ప్రారంభమై వారం రోజులు అవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం విచారకరమని అన్నారు. ఎఫ్‌సీఐ నిబంధనల ప్రకారం ఏప్రిల్ 15న ప్రారంభం కావాల్సిందని, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకుండా ఈనెల 21 తర్వాతే ప్రారంభించాలనే ఆలోచనతో ఉన్నట్లు అనధికార వార్తలు వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే కోతలు కోసిన ధాన్యం నిల్వ ఉంచుకునే మార్గం లేక రైతులు ప్రైవేటు రైస్ మిల్ యజమానులు ఎంఎస్పి ధర 2060 ఉంటే, 1600 నుంచి 1700లకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లేకపోవడంతో ఒక్కో రైతు లక్షలాది రూపాయలు నష్ట పోవాల్సి వచ్చిందని తెలిపారు. దీనికి ప్రధాన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వనిదే కనుక కనీసం కోతలు ప్రారంభమైన ఉమ్మడి నిజామాబాద్, నల్గొండ జిల్లాలో యుద్ధప్రాతిపదికన 15న కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యలు లేవని మహారాష్ట్ర సభలో కేసీఆర్ ప్రకటించడం విడ్డూరంగా ఉందని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం భావిస్తుందన్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ప్రకటించిన లెక్కల ప్రకారం 2014 నుంచి 2020 వరకు 6 076 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్క ఆత్మహత్యలేదని చెప్పడంలో మసిపూసి మారేడుగా చేసినట్లు కాదా అని ప్రశ్నించారు. మరోవైపుకేంద్ర ప్రభుత్వం వ్యవసాయంగానికి ఇచ్చే సబ్సిడీలు అన్ని తగ్గిస్తూ, ఎత్తివేస్తూ, కార్పొరేట్ శక్తులకు అనేక రూపాల్లో సబ్సిడీలను పెంచుతూ ఇస్తూ, లక్షల కోట్ల రూపాయల అప్పులు రద్దుచేసి రైతు వ్యతిరేకంగా తమ స్వభావాన్ని చాటుకుంటున్నాయని తెలిపారు. వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, గత నెలలో తాజాగా భారీ వర్షాలు నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

గన్నారంలో బలగం సినిమా ప్రదర్శన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని గన్నరం గ్రామంలో శుక్రవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శన నిర్వహించారు. గ్రామం మధ్యలో ఎల్ఈడీ స్క్రీన్లద్వారా సినిమాను ప్రదర్శించడంతో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని సినిమాను చుశారు. గ్రామంలో చిన్న పేద్ద తేడా లేకుండా అధిక సంఖ్యలో పాల్గొని సినిమా ను తిలికించినట్లు గ్రామస్తులు తెలిపారు. అందరూ భావోద్వేగానికి లోనయ్యారు. తమ వారిని గుర్తుచేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు.



కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డు అందజేత



కార్డులు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డులను మండలంలోని పోసానిపేటలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గీరెడ్డి మహేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన ప్రశ్నిస్తూ, ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు సాకలి సాయిలు, నాయకులు పోతుల చిన్న భాస్కర్ రెడ్డి, నరేందర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు



నవతెలంగాణ-రాజంపేట్

మండల కేంద్రంలోని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 15 వరకు మండలంలోని యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని ఎస్ఐ జి.రాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల పరిధిలోని యువకులు స్థానిక పోలీస్‌స్టేషన్లో జట్ల వారీగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ క్రీడలలో గెలుపొందిన జట్లుకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నామని ఆయన తెలిపారు. ఆసక్తిగల యువకులు గ్రామాల వారీగా తమ తమ జట్టు వివరాలను పోలీస్ స్టేషన్లో లేదా తమ గ్రామ పోలీసు అధికారికి వివరాలు సమర్పించాలని కోరారు.

మినీ గురుకులంలో దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-రామారెడ్డి

మాచారెడ్డి మండల కేంద్రంలో గల మినీ గురుకులంలో వివిధ తరగతుల్లో విద్యార్థుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.విజయ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటవ తరగతిలో 30 మంది, రెండవ తరగతిలో 5 మందికి ఖాళీలు ఉన్నాయని, మండలానికి చెందిన గిరిజన బాలికలకు మాత్రమే అవకాశం ఉందని, ఐదు సంవత్సరాల పైబడిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, మే 9వ తేదీన అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. దరఖాస్తు చేసేవారు, తల్లిదండ్రుల ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు, విద్యార్థుల బర్త్ సర్టిఫికెట్, కులం, ఆదాయం, తెల్ల రేషన్‌కార్డ్, ఆధార్ కార్డ్ జతచేసి గెజిటెడ్ అధికారిచే ధ్రువీకరించిన పత్రాలను మాచారెడ్డి మినీ గురుకులంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సందేహాలకు 6300132131 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బస్సు ఢీకొని బాలిక మృతి



ఘటనాస్థలంలో బాలిక మృతదేహం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని చెక్‌పోస్టు సమీపంలో గల పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం మహారాష్ట్రకు చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో సాఫియా (12) అనే బాలిక ఘటన స్థలంలోని మృతి చెందినట్టు బోధన్ రూరల్ ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ నుంచి ద్విచక్రవాహనంపై మహారాష్ట్రకు వెళుతున్న షేక్ అబ్బాస్ చెక్ పోస్టు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు రాగానే బోధన్ నుంచి మహారాష్ట్ర వెళుతున్న మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. దాంతో బాలిక ఘటన స్థలంలోనే మృతి చెందింది. బాలిక తండ్రి షేక్ అబ్బాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

పల్లెపల్లెకూ ఓబీసీ.. ఇంటింటికీ బీజేపీ కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ, ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో పల్లెపల్లెకూ ఓబీసీ.. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు పట్లోల రామారావు మాట్లాడుతూ.. ఈ దేశంలో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశంలో ఉన్న ఓబీసీల కోసం అనేక పథకాలను తీసుకువస్తుందని, బీసీల రిజర్వేషన్లను కాపాడుతూ జాతీయ స్థాయిలో బీసీ సాధికారతను పెంపొందించేందుకు బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసి పాలక మండలిని నియమించిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు చీమల్ వార్ సాయిబాబా, నాయకులు శ్రీకాంత్, బక్కోల్ల కిష్టయ్య, వడ్ల శ్రీనివాస్, కమ్మరి సాయిలు, సాయగౌడ్, రమేష్, బాలర్జున్ గౌడ్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడీ సభను విజయవంతం చేయండి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి బాపురెడ్డి



మాట్లాడుతున్న బాపురెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

మోడీ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి బాపురెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలన్నింటినీ ఇంటింటికి చేరవేసి వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించేవరకూ పోరాడుదామని తెలిపారు. సమావేశంలో మండల అధ్యక్షులు జక్సాని దత్తు, రాములు, నియోజకవర్గ కన్వీనర్ అంబే లింగారావు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు మురళి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బొల్లారం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్‌లో 9న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్‌హాలులో ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని పార్టీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపాయి. మండలంలోని 24 జీపీల నుంచి కార్యకర్తలు, సర్పంచులు, గ్రామస్థాయి ముఖ్యమైన ప్రజాప్రతినిధులు ఆత్మీయ సమ్మేళనానికి తప్పక రావాలని, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెలే హన్మంత్ షిండే, ఎంపీ బీబీ పాటిల్ రానున్నారని, కార్యక్రమం విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఆరోగ్యమే.. అత్యంత ధనం..

- సూచించిన వైద్యులు
- ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం
- ప్రభుత్వ వైద్యులకు ఘన సన్మానం

నవతెలంగాణ-నసురుల్లాబాద్/జుక్కల్



నసురుల్లాబాద్ : వైద్యురాలిని సన్మానిస్తున్న దృశ్యం



జుక్కల్‌లో..

అత్యంత ధనం.. ఆరోగ్యమేనని పలువురు వైద్యులు సూచించారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నెహ్రు యువ కేంద్రం, సేవా సంఘ్ ఫ్రెండ్స్ యూత్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువజన కేంద్రం నిర్వాహకులు సునీల్ రాథోడ్ మాట్లాడుతూ.. ఈ ప్రపంచంలో అంత్యంత ధనవంతుడు ఆరోగ్యంగా ఉన్న వ్యక్తేనని అన్నారు. డాక్టర్ సుధా గైనకాలజిస్ట్ మాట్లాడుతూ.. అందరూ ఆరోగ్యంగా ఉండటానికి తగిన చర్యలు తీసుకోవాలని, నిత్యం కచ్చితంగా యోగా చేయాలి, పిల్లలు అల్లరితో పాటు, ఆటలు ఆడే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. మనం తినే ఆహారంలో పండ్లు ఎక్కువగా తీసుకోవాలని, ప్రతి మనిషి 6గంటలు నిద్రపోవాలని సూచించారు. బాన్సువాడ డివిజనల్ పరిధిలో వివిధ మండల ప్రజలకు సేవలు అందిస్తున్న బాన్సువాడ ప్రభుత్వాసుపత్రి వైద్యులకు ప్రపంచ దినోత్సవ సందర్భంగా ఘనంగా సన్మానించారు. డా.సుధా, డా.బాలకృష్ణరావ్, డా.మోహన్‌రెడ్డి, డా.రతన్‌సింగ్, హెడ్‌నర్స్ సుబ్బాయమ్మ, భవానీ, ఎయిడ్స్ కౌన్సిలర్ డా.శ్రీలతకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నెహ్రూ యువజన కేంద్రం నిర్వాహకులు, సునీల్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : ఐఆర్‌సీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కేజీబీవీ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలను నిర్వహించినట్టు ఐఆర్‌సీఎస్ చైర్మెన్ ఉమాకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య దినోత్సవంపై వ్యాస రచన పోటీలు నిర్వహించామని, గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్టు వివరించారు. కార్యక్రమంలో ఐఆర్‌సీఎస్ జిల్లా బాధ్యులు, చైర్మెన్, మండలస్థాయి ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గిరి పుత్రికకు ఎమ్మెల్యే సహకారం

- ఉన్నత చదువుల కోసం ల్యాప్‌టాప్ అందజేత
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్



ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే

గిరిజన విద్యార్థికి ఉన్నత చదువుల నిమిత్తం ఎమ్మెల్యే ల్యాప్‌టాప్‌ను శుక్రవారం అందించారు. మండలంలోని నల్లమడుగు పెద్ద తండా నివాసి ధనావత్ సవాయి రామ్-విజయ దంపతుల కుమార్తె ధనావత్ అమృత హైదరాబాద్‌లోని శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో 3వ సంవత్సరం చదువుతున్నారు. చదువులో నైపుణ్యత ఉన్నా.. ఆర్థిక స్థోమత లేకపోవడం వలన ఇటీవల అమృత ఎల్లారెడ్డి శాసన సభ్యులు జాజాల సురేందర్‌ను హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి బాధను వివరించారు. తనకు క్యాంపస్ ఇంటర్వ్యూలకు సిద్ధపడేందుకు ఆన్ లైన్ పరీక్షలు హాజరయ్యే నిమిత్తం ల్యాప్‌టాప్ అవసరతమవున్నదని, కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా అంత వ్యయం చేసి కొనలేనని వారు ఎమ్మెల్యే ముందు మొరపెట్టుకున్నారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి గిరిజన విద్యార్థిని ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి రూ.45,000 విలువ గల ల్యాప్‌టాప్‌ను నల్లమడుగు పెద్ద తండాలో ఇంజనీరింగ్ విద్యార్థిని అమృత ఇంటికి వెళ్లి అందజేశారు. అడిగిన వెంటనే స్పందించి కొత్త ల్యాప్‌టాప్‌ను అందించి తనను ప్రోత్సహిస్తునందుకు కుటుంబ సభ్యులు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్దారెడ్డి, నల్ల మడుగు పెద్ద తండా సర్పంచ్ రవీందర్ నాయక్, ఎంపీపీ గరీబున్నిసా నయం, వైస్ ఎంపీపీ విటల్‌రెడ్డి, లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి, సర్పంచులు పరశురాం, నరసింహులు, వివేకానంద, లక్ష్మణ్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీలు ఘనునాయక్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, ఫతియోద్దీన్, ఈశ్వర్, సిద్ది రాములు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి



మాట్లాడుతున్న శ్రీనివాస్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని మండలాధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన గ్రామస్థాయి బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ కార్యకర్తలు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నాయకుల కృషి ఎంతైనా అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీని, నాయకులను, ప్రజాప్రతినిధులను, కార్యకర్తలను మహిళలను, యువకులను అందర్నీ కలుపుకొని గ్రామంలో ఒక యూనిట్‌గా తీసుకొని సమావేశం నిర్వహించి రాబోయే ఎన్నికలు సమయత్వం కావాలని తెలిపారు. కార్యకర్తల మధ్య ఏదైనా సమస్యలు ఉంటే మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కారం చేసుకొని చిత్తశుద్ధితో అందరూ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాల్త్య విట్టల్, జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ మజీద్, అంకుల్ క్యాంప్ సర్పంచ్ రాము, సీనియర్ నాయకులు, కంది మల్లేష్, లక్ష్మీనారాయణగౌడ్, చుంచు సాయిలు వెంకటేశ్వర్లు, ఇమ్రాన్, మహిషాగౌడ్, ఖలీల్, నౌషాదుల్ల, మోసిన్, ఇబ్రహీం, రాధా బాబు, రాంబాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చారు.. భూమి చూయించలేదు..

- 12వ రోజుకు రిలే నిరాహార దీక్ష

నవతెలంగాణ-నసురుల్లాబాద్



నిరాహారదీక్షలో పాల్గొన్న బాధితులు, నాయకులు

వ్యవసాయం సాగు చేసుకోమని ప్రభుత్వం పట్టాలు ఇచ్చినా.. ప్రభుత్వ అధికారులు సాగుభూమిని చూపడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని లబ్ధిదారులు అన్నారు. నసురుల్లాబాద్ మండలంలోని నెమ్లి గ్రామానికి చెందిన మత్స్యకారుల భార్య పిల్లలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్ష నేటికీ 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెమ్లి శివారులోని సర్వేనెంబర్ 62/లో 2 ఎకరాల 20 గుంటల సాగుభూమి ఉండేదని, గత కొన్ని ఏండ్ల క్రితం బతుకు దేరువుకోసం ఊరు వదిలి వెళ్లడంతో తాము సాగుచేసిన సాగుభూమి సరిహద్దులు లేకుండా పోయాయని. గత 20 ఏండ్ల క్రితమే భూమిపై వ్యవసాయ రుణాలు పొందామని, మా భూములకు కొత్త, పాత పట్టాలు ఉన్నాయని అన్నారు. భూ సమస్య పరిష్కారం అయ్యే వరకు భూమి కోసం పోరాటం సాగుతూనే ఉంటుందని, ఈనెల 4న భూమి సర్వే చేసి ఇస్తామని తహసీల్దార్ తెలిపినా.. ఇంతవరకు ఏ ఒక్క అధికారి స్పందించకపోవడం బాధాకరమన్నారు. భూమి చూపించే వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

నవతెలంగాణ-బోధన్

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం మంజూరి చేయాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ పాలనాధికారి ముంతాజుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వరి ధాన్యం చేతికొచ్చిన సందర్భంగా బోధన్ డివిజన్ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు జాప్యం లేకుండా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం శాస్త్రీయంగా అమలు చేయడం లేదని దాంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో వ్యవసాయ మార్కెట్లు రైతుల పంట నిల్వలకు నిర్మించిన గోదాంలలో లోపాలున్నాయని అన్నారు. రైతుల నుంచి తరుగు పేరుతో దోపిడీ జరుగుతుందని, రైస్‌మిల్ యజమానులు దళారులను ఏర్పాటు చేసుకొని రైతుల నుంచి అతి తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు.

గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేసే నకిలీ దళారులపైన ప్రభుత్వం చట్టరీత్యా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. బోధన్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఇప్పటికే వరి కోతలు ఊపందుకోవడంతో బోధన్ మార్కెట్ కమిటీ తరపున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కనీసం మద్దతు ధర క్వింటాలుకు రూ.3000లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి 40 వేల రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు పుట్టి నడిపి నాగన్న, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.రాజేశ్వర్, వడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని షేఖాపూర్ గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ల ఇండ్ల నిర్మాణానికి సర్పంచ్ ఎంకే పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బన్సీ పటేల్‌తో కలిసి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే శాఖాపూర్ గ్రామానికి అర్హులైన వారికి ఐదు ఇండ్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గౌతమ్, బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు మమ్మద్ పటేల్, గ్రామ పెద్దలు జాఫర్ పటేల్, మహబూబ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

నవతెలంగాణ-ఎడపల్లి/నసురుల్లాబాద్



ఎడపల్లిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

మండలంలోని క్రైస్తవ సోదరులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను చర్చిలలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే పలు చర్చీల్లో అన్నదానం చేపట్టారు.

నసురుల్లాబాద్ : బాన్సువాడ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. నసురుల్లాబాద్ మండలంలోని అంకోల్ క్యాంప్, బొమ్మన్ దేవ్‌పల్లి, బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్, బీర్కూర్, వెంకటప్పయ్య క్యాంప్‌లో, బాన్సువాడ పట్టణంలోని వివిధ గ్రామాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మన్ దేవ్‌పల్లి గ్రామ పాస్టర్ థామస్ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు అనుసరించిన శాంతి మార్గం, సిలువలో పలికిన ఏడు మాటల కోసం, ప్రపంచశాంతి కోసం సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, వివిధ సంఘస్తులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం



సర్పంచ్‌ను సన్మానిస్తున్న అధికారి

నవతెలంగాణ-మద్నూర్

ఇటు తెలంగాణ అటు మహారాష్ట్ర కర్ణాటక ఈ మూడు రాష్ట్రాలకు పూర్తిగా సరిహద్దులో గల సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి సర్పంచ్ షేక్ గఫర్ కృషి అభినందనీయమని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఆలయ ఆవరణలో సర్పంచును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ అధికారి వేణు, ఆలయ పూజారి ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

వరిలో మెడ విరుపు, కంకి నల్లి తెగుళ్లు



పంటను పరిశీలిస్తున్న ఏఈవో

నవతెలంగాణ-రామారెడ్డి

వరి సాగులో మెడ విరుపు, కంకి నల్లి వంటి తెగుళ్లు సోకి, పంట చేతికొచ్చే సమయంలో దిగుబడి తగ్గే అవకాశం ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఓ రాకేష్ శుక్రవారం రైతులకు సూచించారు. క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు మెడవిరుపునకు ఎకరానికి మెడ విరుపునకు తెబ్యుకొనజోల్‌ట్రిఫ్లోక్సీస్ట్రోబిన్ 120 ఎం.ఎల్ కంకినల్లి-స్పైరోమెసిఫిన్ 200 ఎం.ఎల్ చొప్పున పిచికారీ చేయాలని సూచించారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం పెగడాపల్లి గ్రామంలో శుక్రవారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గ్రామస్తులు కుస్తీ పోటీలను నిర్వహించారు ఈ సందర్భంగా సమీప గ్రామాల నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి మల్లయోధులు తరలివచ్చి ఈ కుస్తీ పోటీలలో తలపడ్డారు. విజేతలకు సర్పంచ్ గ్రామ అభివృద్ధి కమిటీ పెద్దలు నగదు బహుమతి అందించి అభినందించారు . కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం

విజయవంతం చేయాలని బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపు

నవతెలంగాణ -డిచ్‌పల్లి

నేడు డిచ్ పల్లి మండల కేంద్రంలో నిర్వహించే బిఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో భారీ సంఖ్యలో టీఅర్ఎస్ కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం పిలుపు ఇచ్చారు. డిచ్ పల్లి మండలానికి సంబంధించిన మండల స్థాయి బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం అమృత గార్డెన్‌లో ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు సమయానికి చేరుకోవాలని సూచించారు.

నిత్యావసర సరుకులు ఉచితంగా అందించాలి

- ప్రగతిశీల మహిళా సంఘం
- జిల్లా అధ్యక్షురాలు సత్యక్క
- 50శాతం సబ్సిడీతో గ్యాస్ సిలెండర్ ఇవ్వాలి
- కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/డిచ్‌పల్లి/ఆర్మూర్

ప్రభుత్వం చౌక ధరల దుకాణల ద్వారా 12 రకాల నిత్యవసర సరుకులను పేదలకు ఉచితంగా అందించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సత్యక్క డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రాజరాజేశ్వరి నగర్‌లో పివైఎల్- పిఓడబ్ల్యు ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా సత్యక్క పాల్గొని మాట్లాడారు. రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులను ప్రజలకు ఉచితంగా అందించాలన్నారు. తెలంగాణ వస్తే పేదలకు భూములు, ఇండ్ల స్థలాలు, కొలువులు, ఇండ్లు రేషన్ కార్డులు తదితర సమస్యలు సమసిపోతాయని ప్రజల ఆశించారన్నారు. పక్షం రోజులకోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన ఫలితంగా రవాణా చార్జీలు ఉప్పు, పప్పు దగ్గర నుండి ప్రతి వస్తువు ధరలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 450 రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను మోడీపాలనలో 1200 రూపాయలకు పైగా పెంచి సబ్సిడీ ఎత్తేసిందని దుయ్యబట్టారు. మోడీ ప్రభుత్వం కాకులను కొట్టి గద్దల కేసినట్టుగా, పేదోళ్లను కొట్టి కుబేరులైన ఆదాని, అంబానీలకు లక్షల కోట్లు దోచిపెడుతుందని విమర్శించారు. ఒక్కొక్కరికి ఐదు కేజీల బియ్యం అవి ముక్కిన బియ్యాన్ని, పురుగులు పట్టిన బియ్యాన్ని ముఖాన కొడుతున్నారన్నారు. ఇలాంటి విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజలందరూ తిరగబడాలని పిలుపునిచ్చారు. ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు కిలోలు, కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోల చొప్పున సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రేషన్ షాపుల ద్వారా మంచి నూనె, కందిపప్పు, చింతపండు, గోధుమలు, పల్లి, ఉప్పు, కారం, పసుపు చక్కెర, టీ పొడి ఉచితంగా అందించాలన్నారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, వంట గ్యాస్‌ను సగం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఓడబ్ల్యు, పివైఎల్, ప్రజాపంథా పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టి ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టపరచుకోవడం కోసం ఉద్యమిస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వి. లక్ష్మి, మధు, స్వర్ణ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో..

డిచ్‌పల్లి:రేషన్ షాపుల ద్వారా ప్రజలకు 12 రకాల సరుకులు అందజేయాలని, 50శాతం సబ్సిడీతో గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయాలని, నూతన రేషన్ కార్డులను వెంటనే ఇవ్వాలని, తదితర డిమాండ్లతో ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు), ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో శుక్రవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా (పిఓడబ్ల్యు), (పీవైఎల్) నాయకులు మాట్లాడుతూ.. ఇష్టాను సారంగా ధరలను పెంచి సబ్సిడీ కూడా ఎత్తివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కార్పోరేటర్ల అనుకూల నిర్ణయంలో భాగంగానే ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న నరేంద్ర మోడీ, ఆదాని, అంబానీలకు ఈ సంపదను కట్టబెడుతు న్నారని వారన్నారు. ఈ దేశాన్ని అప్పుల దేశంగా మార్చి, పెద్ద కార్పొరేట్ వ్యక్తులకు సబ్సిడీ ఇస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్న భారాలపై ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ మండల నాయకురాలు వనిత, లావణ్య, జ్యోత్స్న, రాధా, లలిత, సుజాత, మురళి, సాయాగౌడ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆర్మూర్:రేషన్ షాపుల్లో బియ్యంతో సహా 12 రకాల నిత్యావసర వస్తువులు ఇవ్వాలని పీవైఎల్ మండల కార్యదర్శి తూర్పాటి శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి రేషన్ షాపుల వద్ద పివైఎల్ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకప్పుడు రేషన్ షాపులో బియ్యంతో సహా వంటనూనె, కిరోసిన్, చింతపండు, పప్పు, కారం, సబ్బులు, సరుపులు ఇచ్చేవారన్నారు. ఇప్పుడు కేవలం ఒకరికి ఐదుకిలోల బియ్యం తోనే సరిపెట్టుకుంటున్నాయని తెలిపారు. కొత్తగా అప్లై చేసుకున్న రేషన్ కార్డులను మంజూరు చేయాలనే డిమాండ్లతో ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి పూనుకుంటుందన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకులు మనోజ్ ,నాయకులు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో..

ఆర్మూర్ బార్‌అసోసియేషన్ అధ్యక్షునికి సన్మానం



అధ్యక్షుడిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన న్యాయవాది సరసం చిన్నారెడ్డిని గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. ఇటీవల జరిగిన ఆర్మూర్ బార్‌అసోసియేషన్ ఎన్నికల్లో చిన్నారెడ్డి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. గ్రామానికి చెందిన వ్యక్తి బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికవ్వడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక శ్రీ బాల రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద గ్రామస్తులు చిన్నారెడ్డిని శాలువా పూలమాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మేడారం భూమన్న, కొమ్ముల రవీందర్, బద్దం తిరుపతిరెడ్డి, నడుకుడ మోహన్, ఏనేడ్ల రవీందర్, భువనగిరి భాస్కర్, బద్దం రమేష్, గోసం మురళి, హనుమాన్ మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న దేవేందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈనెల 9న మండలంలోని కోనా సముందర్ గ్రామంలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ కోరారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, గృహ నిర్మాణ శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం బాల్కొండ నియోజకవర్గంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ ఇంచార్జి, బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు రాజాగౌడ్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కుటుంబ సభ్యులతో కలసి తరలి రావాలన్నారు. మానాల గ్రామంతో పాటు తండా పంచాయతీల నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆత్మీయ సమ్మేళనానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రుద్రంగి మండల అధ్యక్షుడు తిరుపతి, వైస్ ఎంపీపీ పిసరి భూమయ్య, పాక్స్ చైర్మన్ చిన్నారెడ్డి, వైస్ చైర్మన్ అంబర్ సింగ్, ఎంపీటీసీ సభ్యులు, అన్ని గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, మార్కెట్, పాక్స్ డైరెక్టర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, సీనియర్ నాయకులు నరేశ్, భూమా నాయక్, జులా భూమన్న, రుద్రంగి మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు రాందాస్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు



సిలువతో ఏసుక్రీస్తు

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్థానిక సుభాష్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ చర్చ్‌లో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆనాడు ప్రభువు పడిన కష్టాలను అందరికీ తెలిసే విధంగా చర్చి యూత్ సభ్యులు రోల్ ప్లే ద్వారా నాటి దృశ్యాలను కళ్ళ కట్టినట్లుగా తెలిపారు. ప్రభువు పడిన కష్టాలను ప్రజలందరూ బరువెక్కిన హృదయంతో తిలకించి కన్నీటి పర్యంతమయ్యారు. గుడ్ ఫ్రైడే నాడు సిలువకు కొట్టి మరణం, సమాధి చేయడం అనంతరం మూడో నాడు ప్రభువు తిరిగి లేచిన సందర్భాన్ని ఈస్టర్ పండుగగా క్రైస్తవులు కొనియాడుతున్నారు. గురువారం, శుక్రవారం, శనివారం చర్చిలో నిరంతరం ప్రార్థనలు జరుగుతున్నాయని పారిష్ ప్రీస్ట్ ఏ ఇన్నారెడ్డి తెలిపారు. 40 రోజులుగా ఉపవాస ప్రార్థనలు చేస్తున్న సంఘ సభ్యులు అందరూ ఈ గుడ్ ఫ్రైడేతో ఉపవాసాలు ముగుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో, నిర్మల హృదయ సిస్టర్స్, సుపీరియర్ సిస్టర్ మార్గరెట్ , పారిషనర్ కు మరియు కౌన్సిల్ మెంబర్స్ వై డేవిడ్, బాలస్వామి ,హ్యారీ, ప్రవీణ్ , అగస్టీన్ , సవీ, అగ్నేస్ , మరియు పుష్ప , లౌర్డు, క్రాంతి జిమ్మీ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీళ్ల కోసం ఎమ్మెల్యే వినతి



వినతినిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-మోపాల్

వేసవి సమీపిస్తున్న కొద్ది గ్రామాల్లో నీటి కొరతతో ఇబ్బందులకు గురవుతున్నామని, వెంటనే తమ గ్రామాల్లో నీటి సమస్యను తీర్చాలని బైరాపూర్, అమ్రాబాద్ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే బాజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మిషన్ భగీరథ నీళ్ల కొరత గురించి గౌరవ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లత కన్నీరం, మండల అధ్యక్షుడు ముచ్చ శ్రీనివాస్, అమ్రాబాద్ సర్పంచ్, గుడి తండా సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

నవతెలంగాణ-సిరికొండ

తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పిటిసి ధర్పల్లి ఒలంపిక్ ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం డైరీ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ స్వగృహంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాంబారి మోహన్, సిరికొండ మండల రైతు సమన్వయ అధ్యక్షులు ఆకుల తిరుమల, కెవిపిఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మల్యాల సుమన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగంగాధర్, సిరికొండ మండల అధ్యక్షులు దేవుడు గొల్ల శంకర్ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్‌విందు

పాల్గొన్న సభాపతి పోచారం

నవతెలంగాణ-కోటగిరి

రంజాన్ మాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఏబీఆర్ గార్డెన్లో శుక్రవారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో మైనార్టీ సోదరులు ఉపవాస దీక్షలు చేసి భగవంతుని ఆరాధనలో ఉంటారనిఅన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మైనారిటీల కోసం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని , ఇమామ్‌లకు ప్రతి నెల పారితోషకం అందజేస్తు, వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. మైనార్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలను నెల కొల్పారని పేర్కొన్నారు, ఉమ్మడి మండలాలకు చెందిన నిరుపేదలైన వారికి రంజాన్ తోఫా అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల తహసీల్దార్లు, ముఖ్యఅతిథి పోచారం సురేందర్ రెడ్డి, కోఆప్షన్ సిరాజుద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ హమీద్, ఎంపీటీసీ సలీం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏజాస్ ఖాన్, సర్పంచ్ పత్తి లక్ష్మణ్, మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు , తదితరులు పాల్గొన్నారు



ఇఫ్తార్‌విందులో స్పీకర్, నాయకులు

ప్రమాదకరంగా గుంత

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందర రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. బస్టాండ్ వద్ద జనసంచారం గల ప్రాంతంలో పెద్ద గుంత, మురికి కాలువ ఏర్పడడంతో గుంతలను తప్పించే క్రమంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసకుంటున్నాయి.

అనునిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై గుంత ఏర్పడినా అధికారులు పట్టించుకోవడం లేదు. బాన్సువాడ నుంచి వర్ని వెళ్లే రహదారిపై గుంతలు ఏర్పడడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న రోడ్డు భవనాల శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్డు శిథిలావస్థకు చేరి ఇరుకు వంతెనలతో ప్రజలు ఇబ్బందులు గురైన తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఎల్లారెడ్డి నుంచి బోధన్ వరకు నాలుగు లైన్ల రోడ్డు మంజూరైనట్లు ప్రకటన రావడంతో ఈ రోడ్డు నేషనల్ హైవే అథారిటీ పరిధిలోకి వెళ్లినట్లు ఆర్ అండ్ బి అధికారులు తెలిపారు. రహదారిపై ఎలాంటి సమస్యలున్న తాము నేషనల్ హైవే అథారిటీ వారికి నివేదిక పంపిస్తామన్నారు. అక్కడక్కడ రోడ్డు అధ్వానంగా ఉంది. ఏ ప్రాణహాని జరుగక ముందే గుంతలు పూడిస్తే బాగుంటదని ప్రజలు కోరుకుంటున్నారు



ప్రమాదకరంగా మారిన గుంత

నూతన జడ్జిలకు సన్మానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన నూతనంగా ఎంపికైనా జడ్జిలకి ఎల్లారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిఫ్ కోర్టులో సన్మానించారు.ఈ సందర్భంగా

ఎల్లారెడ్డి పట్టణానికి చెందినా సివిల్ న్యాయమూర్తిగా ఎంపికైన న్యాయవాది పద్మ పండరీ కూతురు సాయి శ్రీ, డిస్ట్రిక్ట్ సెషన్ కోర్ట్ న్యాయమూర్తి నామ సంతోష్ కుమార్‌ను సన్మానించారు. అదేవిధంగా ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్ట్ న్యాయమూర్తి గండ్ల హారికను సన్మానించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి బార్ అధ్యక్షులు నామ శ్రీకాంత్, ఎల్లారెడ్డి డిఎస్పీ శ్రీనివాస్, సిఐ శ్రీనివాస్, ఎస్ ఐ గణేష్,లింగంపేట్ ఎస్ ఐ శంకర్,నాగిరెడ్డిపేట్ ఎస్ఐ ఆంజనేయులు, గాంధారి ఎస్ఐ సుధాకర్ పాల్గొని న్యాయమూర్తులకు శాలువాతో సన్మానం చేశారు.



జడ్జిలను సన్మానిస్తున్న పలువురు

కాంగ్రెస్ సభ్యత్వ కార్డులు పంపిణీ

నవతెలంగాణ-సదాశవనగర్

కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కమిటీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య మాట్లాడుతూ.. 575 సభ్యత్వ నమోదు కార్డులను సదాశివ నగర్ గ్రామంలోని ఎస్సీ వాడలో పంపిణీ చేశామని తెలిపారు. మూడు నెలల క్రితం కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం ఉన్న వ్యక్తి తలారి సాయిలు మృతి చెందడంతో టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డేపల్లి సుభాష్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఆయన భార్యకు రెండు లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేసినట్టు తెలిపారు. 35 వేల సభ్యత్వ కార్డులగాను ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డేపల్లి సుభాష్ రెడ్డి 4 లక్షల 75 వేల రూపాయలు ఇన్సూరెన్స్ డబ్బులుచెల్లించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే ఈ బీమా కాంగ్రెస్ పార్టీ ధీమా అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని కుల వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నగర్ మండల యూత్ అధ్యక్షులు కోతిలింగారెడ్డి గ్రామ అధ్యక్షులు చిందం రాజయ్య, ఎస్ఎస్ఎల్ జనరల్ సెక్రెటరీ జగ్గ బాలరాజు, నాయకులు, గ్రామ ఉపాధ్యక్షులు ప్రభు స్వామి, జనగామ రాజు, కురుమ ఎల్లయ్య, కోరి బాలరాజు, గాదారి నర్సిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు జగ్గా స్వరూప కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

పల్లె పల్లెకు ఓబీసీ కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని 11,12 ,13 , 34 వార్డులలో "పల్లె పల్లెకు ఓబీసీ - ఇంటింటికి బిజెపి" కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్, బీసీ మోర్చ పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మిరియాల్ కర్ కిరణ్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు విజయానంద్, బిజెపి సీనియర్ నాయకులు మీసాల రాజేశ్వర్, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి ఉదయ్ గౌడ్, బీసీ మోర్చ పట్టణ కార్యదర్శి రుద్రవేణి రమేష్, బండారి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అన్ని గ్రామాలలో చర్చిలలో శుభశుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్టు జక్రాన్‌పల్లి సీఎస్ఐ చర్చి పాస్టర్ శశి ప్రకాష్ తెలిపారు. చర్చీలు పాటలతో మారు మ్రోగాయి. 40 రోజులు ఉపవాసం ఉండి బోధించిన విధానం గురించి, ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలు గురించి వివరించారు. కార్యక్రమంలో చర్చిల పాస్టర్లు, క్రిస్టియన్లు, యువకులు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.